సాక్షి
రంగారెడ్డి

శుక్రవారం । 13 । అక్టోబర్ । 2023



శరన్నవరాత్రులకు ముస్తాబు

శరన్నవరాత్రి మహోత్సవాలకు ఆమనగల్లులోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం ముస్తాబవుతోంది. 10లో▸



సాగుకు చేయూత

ఆయిల్ పామ్ పంట సాగుకు ప్రభుత్వం చేయూతనందిస్తోందని మండల వ్యవసాయాధికారి జ్యోతి తెలిపారు. 10లో▸



యువత చేతుల్లోనే..

దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని బీజేవైఎం జాతీయ అధ్యక్షుడు తేజస్వీ సూర్య పేర్కొన్నారు. 10లో▸



చేవెళ్ల: శ్రీసాయిచైతన్య హైస్కూల్‌లో బతుకమ్మ సంబరాలు

బడుల్లో బతుకమ్మ సంబరాలు

బతుకమ్మ సంబురాలను ఆయా పాఠశాల్లో వైభవంగా నిర్వహించారు. శుక్రవారం నుంచి దసరా సెలవులు ప్రారంభం కానున్న నేపథ్యంలో గురువారం వేడుకలు జరుపుకొన్నారు. విద్యార్థులు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా ముస్తాబు చేసి తీసుకు వచ్చారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ వస్త్రాలు ధరించి ఆటపాటలతో హోరెత్తించారు. ఉపాధ్యాయులు తెలంగాణలో బతుకమ్మ పండుగ విశిష్టతను వివరించారు.



మీర్‌పేట: నాగార్జున మాంటిస్సోరి పాఠశాలలో వేడుకలు



ఆమనగల్లు: బతుకమ్మతో చిన్నారి

న్యూస్‌రీల్

16న మహేశ్వరానికి రాజ్‌నాథ్‌సింగ్ రాక

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎన్నికల ప్రచారంలో భాగంగా కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఈనెల 16న మహేశ్వరం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. బడంగ్‌పేట్ మున్సిపల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేయనున్న భారీ బహిరంగ సభలో పాల్గొననున్నారు. బీజేపీ అభ్యర్థి తరఫున ఆయన ప్రచారం చేయనున్నారు. సాయంత్రం 5 గంటలకు నిర్వహించే ఈ బహిరంగ సభలో కేంద్ర మంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సహా జాతీయ కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్, సీనియర్ నేతలు హాజరుకానున్నారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్కా నర్సింహారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు తదితరులు గురువారం సభాస్థలిని పరిశీలించారు. బహిరంగ సభ ఏర్పాట్లు, జన సమీకరణపై చర్చించారు.

రికార్డుల నిర్వహణ పారదర్శకంగా ఉండాలి



ఆన్‌లైన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రెడ్డి

మొయినాబాద్: పంచాయతీ రికార్డుల నిర్వహణ పారదర్శకంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు గ్రామ పంచాయతీని గురువారం ఆయన సందర్శించారు. ఏయే రికార్డులను ఎలా నిర్వహిస్తున్నారో పరిశీలించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. పంచాయతీ నుంచి ఖర్చుచేసే ప్రతి రూపాయికి లెక్క ఉండాలన్నారు. అన్నింటికీ రశీదులు, బిల్లులు తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. గ్రామ పంచాయతీ నుంచి చెల్లించాల్సిన వీధి దీపాలు, మోటార్ల కరెంటు బిల్లులు, మిషన్ భగీరథ నీటి బిల్లులు, ఇతర బిల్లులు, పన్నులను ఎప్పటికప్పుడు చెల్లించాలన్నారు. పంచాయతీ నుంచి చెల్లించాల్సిన బిల్లులను పెండింగ్‌లో పెట్టొద్దని సూచించారు. ఇంటి పన్నులు, ఇతర పన్నులను సక్రమంగా వసూలు చేయాలని.. ఈసారి వందశాతం పన్నులు వసూలు చేసేందుకు కృషి చేయాలన్నారు. ఆయనవెంట పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, కారోబార్ రాజేష్ తదితరులు ఉన్నారు.

ఆశలందరినీ విధుల్లోకి తీసుకోవాలి



డీఎంహెచ్‌ఓకు వినతిపత్రం అందజేసిన ఆశ యూనియన్, సీఐటీయూ నాయకులు

షాద్‌నగర్‌రూరల్: సమస్యల పరిష్కారంకోసం చేపట్టిన సమ్మెలో పాల్గొన్న ఆశ వర్కర్లందరినీ తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఆశ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సీఐటీయూ, ఆశ యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 5న షాద్‌నగర్ పర్యటనకు వచ్చిన ఐటీ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్‌ను కలిసి సమస్యలపై వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తే ముందస్తు చర్యగా పోలీసులు ఆశలందరినీ పోలీస్‌స్టేషన్‌కు తరలించారని అన్నారు. కేటీఆర్‌ఎస్ సభలో నినాదాలు చేశారనే ఆరోపణలతో 11మంది ఆశ వర్కర్లపై 141 సెక్షన్ ప్రకారం కేసులు నమోదు చేశారన్నారు. సమ్మె అనంతరం ఆశవర్కర్లను విధుల్లోకి తీసుకున్న ప్రభుత్వం 11 మందిని డ్యూటీలోకి తీసుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. సమ్మెలో పాల్గొన్న వాళ్లందరినీ విధుల్లోకి తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు సాయిబాబా, ఆశ వర్కర్లు ఉన్నారు.

సీటుముడి

కాంగ్రెస్ పార్టీలో టికెట్ల పంచాయితీ

- మహేశ్వరం, తాండూరుపై తకరారు
- ఒక్కో సభ్యుడు ఒక్కొక్కరి పేరు సిఫార్సు
- ఎటూ తేల్చుకోలేకపోయిన మురళీధరన్ కమిటీ
- ఎవరికి వారే ప్రచారం కొనసాగింపు
- 14 తర్వాత జాబితా వెల్లడించే అవకాశం



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపికపై నెలకొన్న ఉత్కంఠ ఇప్పటికీ తొలగిపోలేదు. స్క్రీనింగ్ కమిటీలోని సభ్యులు రెండు వర్గాలుగా చీలిపోయి.. ఒక్కో వర్గం.. ఒక్కో అభ్యర్థి పేరును సూచిస్తుండటంతో మురళీధరన్ నేతృత్వంలోని ఎంపిక కమిటీ కూడా ఎటూ తేల్చుకోలేకపోతోంది. క్షేత్రస్థాయి సర్వే ఫలితాలకు.. సభ్యులు ప్రతిపాదిస్తున్న పేర్లకు పొంతన లేకుండా పోవడం కూడా మరో కారణంగా తెలిసింది. మహేశ్వరం, తాండూరు మినహా మిగిలిన నియోజకవర్గాల్లో అభ్యర్థుల పేర్లు దాదాపు ఖరారైనట్లు సమాచారం. అధిష్టానం తీసుకునే నిర్ణయంపైనే ఇక్కడి అభ్యర్థుల భవిష్యత్తు ఆధారపడి ఉంది. ఛత్తీస్‌ఘడ్, రాజస్థాన్‌లో తొలి దశలో ఎన్నికలు ఉండటంతో అధిష్టానం ఆయా రాష్ట్రాల్లోని అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించింది. 14 తర్వాత తెలంగాణ అభ్యర్థుల జాబితాపై ఓ స్పష్టత రానున్నట్లు సమాచారం.

ఏఐసీసీ కోర్టులో మహేశ్వరం సీటు

మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి మొదటి నుంచి మంచి పట్టుంది. సెగ్మెంట్ నుంచి 8 మంది దరఖాస్తు చేసుకున్నారు. డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాత, సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి సహా మొత్తం 8 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో మేయర్ చిగురింత పారిజాత పేరు దాదాపు ఖరారైందనుకున్న సమయంలో ఆశావహుల నుంచి అసంతృప్తి మొదలైంది. ఏళ్ల తరబడి పార్టీ జెండానే నమ్ముకుని పని చేస్తున్న సీనియర్ నేతలను కాదని, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి టికెట్ ఎలా ఇస్తారనే ప్రశ్న ఉత్పన్నమైంది. ఇటీవలే బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లోచేరిన కొత్త మనోహర్‌రెడ్డి సైతం ఇక్కడి నుంచి టికెట్ ఆశించారు. స్క్రీనింగ్ కమిటీ ఎంపిక చేసిన జాబితాలో తన పేరు లేదని తెలిసి, ఏకంగా పీసీసీ చీఫ్ రేవంత్‌పైనే టికెట్లు అమ్ముకున్నారనే ఆరోపణలు గుప్పించారు. ఇదే సమయంలో డీసీసీ అధ్యక్షుడు చల్లా సహా ఇతర సీనియర్ నేతలు ఢిల్లీకి వెళ్లి పార్టీ పెద్దల ముందు తమ అభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలిసింది. సీనియర్లలో ఎవరికి ఇచ్చినా పరవాలేదు కాని.. ఇతరులెవరికీ టికెట్ ఇచ్చినా పని చేయబోమని తేల్చిచెప్పినట్లు సమాచారం. దీంతో అధిష్టానం ఈ సీటు కేటాయింపుపై సందిగ్ధంలో పడింది. పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి మేయర్ కోసం పట్టుబడుతుండగా, భట్టి, యాష్కీ సహా ఇతర సభ్యులు చల్లా లేదా దేప పేర్లను ప్రతిపాదిస్తున్నట్లు తెలిసింది. స్క్రీనింగ్ కమిటీ సభ్యులు రెండు వర్గాలుగా విడిపోయి.. వేర్వేరు పేర్లను సూచిస్తుండ టంతో మురళీధరన్ నేతృత్వంలోని ఎంపిక కమిటీ కూడా చేతులెత్తేసింది. అభ్యర్థి ఎంపిక బాధ్యతను ఏఐసీసీకి అప్పగించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. క్షేత్రస్థాయిలోని నేతలు మాత్రం ఎవరికి వారే తమకే టికెట్ వస్తుందని ప్రచారం చేసుకుంటుండటం గమనార్హం.

అధిష్టానానిదే ఫైనల్

వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గంలోనూ కాంగ్రెస్ పార్టీకి గట్టిపట్టుంది. మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి కొంతకాలంగా ఇక్కడే మకాం వేశారు. కాంగ్రెస్ నుంచి పోటీ చేయబోతున్నట్లు ప్రచారం చేసుకుంటున్నారు. పీసీసీ చీఫ్ రేవంత్‌తో ఆయనకు అభిప్రాయ బేధాలు లేకపోలేదు. దీంతో ఆయన ఏకంగా ఏఐసీసీ పెద్దల ఆశీస్సులతో రంగంలోకి దిగారు. తీరా అభ్యర్థుల జాబితాను ప్రకటించే ముందు బీఆర్‌ఎస్ నేత.. డీసీసీబీ చైర్మన్ బి.మనోహర్‌రెడ్డిని కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. తాండూరు టికెట్ మనోహర్‌రెడ్డికి కేటాయిస్తున్నట్లు ప్రచారం జరిగింది. పీసీసీ చీఫ్ రేవంత్ మనోహర్‌రెడ్డి పేరును సూచిస్తుంటే.. భట్టి సహా ఇతర నేతలు కేఎల్‌ఆర్ పేరును సూచిస్తున్నట్లు తెలిసింది. స్క్రీనింగ్ కమిటీ సభ్యులు రెండు వర్గాలుగా విడిపోయి వేర్వేరు పేర్లను సిఫార్సు చేయడం, ఈ మేరకు ఒత్తిడి తీసుకొస్తుండటంతో మురళీధరన్ క మిటీ ఎటూ తేల్చుకోలేక.. అభ్యర్థి పేరు పరిశీలన అంశాన్ని పక్కన పెట్టింది. టికెట్ కేటాయింపు అంశాన్ని పూర్తిగా అధిష్టానానికే వదిలేసింది. అప్పటి వరకు ఈ సీటుపై ఆశలు పెట్టుకున్న పార్టీ అధికార ప్రతినిధి కాల్వ సుజాత సైతం స్థానికేతరులకు టికెట్ కేటాయించే అంశాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తుండటం గమనార్హం. 14 తర్వాత విడుదల చేసే మొదటి విడత జాబితాలో ఇక్కడి అభ్యర్థి పేరు ఉండకపోవచ్చని.. తుది జాబితాలోనే పేరు ఖరారు చేసే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

ఆ ఆస్తులను ఎవరు కొన్నా చెల్లవు



వీరభద్రీయ సంఘం ఇళ్లకు నోటీసు బోర్డులను ఏర్పాటు చేస్తున్న సీఐడీ ఏసీపీ రాములు

శంకర్‌పల్లి: కోర్టు ఆధీనంలో ఉన్న శంకర్‌పల్లి వీరభద్రీయ పరపతి సంఘం ఆస్తులను ఎవరు కొనుగోలు చేసినా చట్టపరంగా చెల్లవని సీఐడీ ఏసీపీ రాములు తెలిపారు. గతంలో కోర్టు ఆధీనంలో ఉన్న వీర భద్రీయ సంఘం భవనం, సంఘంలో సభ్యుల ఇళ్లకు, ఖాళీ ప్లాట్లకు శంకర్‌పల్లి పోలీసుల ఆధ్వర్యంలో గురువారం నోటీస్ బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శంకర్‌పల్లిలోని వీరభద్రీయ సంఘం చిట్‌ఫండ్ కంపెనీ పేరుతో చిట్టీలు పెట్టడంతో పాటు పెద్ద ఎత్తున ప్రజల నుంచి డబ్బులను డిపాజిట్ చేసుకోవడం జరిగిందన్నారు. చిట్టీ డబ్బులతో పాటు, డిపాజిట్ డబ్బులను ఇవ్వకపోవడంతో బాధితులు 2018లో శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. పోలీసులు దర్యాప్తు చేసి కేసును సీఐడీకి అప్పగించినట్టు తెలిపారు. వీరభద్రీయ సంఘానికి సంబంధించిన 21 స్థిరాస్తులు (ఇళ్లు, ఖాళీ స్థలాలు), 21 చరాస్తులు అయిన బంగారం నగలు, వాహనాలను సీజ్ చేయడం జరిగిందన్నారు. సంఘంలో సుమారు 2000 మంది బాధితులు ఉండగా వారిని సుమారు 60కోట్లకు పైగా మోసం చేసినట్లు గుర్తించామని అన్నారు. సంఘానికి సంబంధించి మొత్తం 82 మందిపై కేసు నమోదు చేసి 78 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని చెప్పారు. సంఘం ఆస్తులన్నీ ఎల్‌బీనగర్ కోర్టు ఆధీనంలో ఉన్నాయని తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు నడుచుకుంటామన్నారు. బాధితులెవరైనా ఉంటే తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

మరో చాన్స్

- ఓటరు నమోదుకు మరోసారి అవకాశం
- ఈ నెల 31వ తేదీ వరకు గడువు



ఓటరు నమోదు దరఖాస్తు అందజేత (ఫైల్)

తుర్కయంజాల్: నవంబర్ 30న జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని కేంద్ర ఎన్నికల సంఘం భావిస్తోంది. ఇప్పటికే ఈ నెల 4న ఓటర్ల తుది జాబితాను విడుదల చేయడంతో పాటు, 9న ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటికీ ఓటరు నమోదుకు మరోసారి అవకాశం కల్పించాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు జాబితాలో పేరు లేకపోతే నమోదు చేసుకోవడానికి ఈ నెల 31వ తేదీ వరకు అవకాశం ఉంది. 2023 అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఎవరైనా ఉంటే ఆన్‌లైన్‌లో తహసీల్దార్ కార్యాలయం, మీ సేవా కేంద్రాలు లేదా స్థానికంగా ఉండే బీఎల్‌ఓలను సంప్రదించి ఫారం–6లో పూర్తి వివరాలను నింపి దరఖాస్తు చేసుకోవచ్చు.

దివ్యాంగులకు ఇంటి నుంచే..

40 శాతం కంటే మించి వైకల్యం కలిగి ఉన్న దివ్యాంగులు పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఇబ్బంది పడాల్సిన పనిలేదు. నేరుగా ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునేలా ఎన్నికల సంఘం అవకాశం కల్పిస్తుంది. 80 ఏళ్ల వయస్సు దాటిన ఓటర్లకు కూడా ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునే వెసలుబాటు కల్పిస్తున్నారు. ఇందుకుగాను స్థానికంగా ఉండే బూత్ లెవల్ ఆఫీసర్‌ను సంప్రదించి 12డి ఫారంలో వివరాలను నింపి దరఖాస్తు చేసుకోవాలి. పరిశీలన అనంతరం ఇంటి నుంచే ఓటు వినియోగానికి అవకాశం కల్పిస్తారు.

ఓటు నమోదుకు మాత్రమే అవకాశం

జాబితాలో పేర్లు తప్పుగా రావడం, ఇంటి చిరునామా తదితర మార్పులు, చేర్పులకు గతంలో చాలాసార్లు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. చనిపోయిన వారి పేర్లను తొలగించారు. ఎన్నో వడపోతల అనంతరం ఈ నెల 4న తుది జాబితాను ప్రకటించారు. ఈసారి మాత్రం పైన పేర్కొన్న వాటికి అవకాశం లేదు. ఓటు హక్కు నమోదుకు మాత్రమే అవకాశం ఉంది.

ఇప్పటికే 33,56, 056 మంది ఓటర్లు

జిల్లాలో ఇప్పటికే 33,56,056 మంది ఓటర్లు ఉండగా, వీరిలో పురుషులు 17,38,994 మంది, మహిళలు 16,15,876, థర్డ్ జెండర్ 404, ఎన్ఆర్ఐ ఓటర్లు 192, సర్వీస్ ఓటర్లు 590 మంది ఉన్నారు. మొత్తం పోలింగ్ కేంద్రాలు 3,369 ఉన్నాయి.

అంతా భూమాయ!

- సీసీఎల్‌ఏలో ఒకలా.. రెవెన్యూలో మరోలా..
- మహేశ్వరం.. మంఖాల్ కేంద్రంగా భారీ భూ దందా
- భూదాన్ భూమిని పట్టా భూమిగా మార్చిన వైనం
- రియల్టర్లతో రెవెన్యూ అధికారుల కుమ్మక్కు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: రెవెన్యూ అధికారుల అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. అడిగినంత ముట్టజెబితే చాలు.. దరఖాస్తు చేసుకున్న తేదీ, నెలతో సంబంధం లేకుండా రిపోర్టులు జారీ చేస్తున్నారు. క్షేత్రస్థాయి అధికారులు ఇచ్చే నివేదికల ఆధారంగా అనుమతి లేదా తిరస్కరిస్తున్నారు. ఈ నివేదికను ఆసరాగా చేసుకుని స్థానిక తహసీల్దార్లు చేతివాటాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ, అసైన్డ్, భూదాన్, సీలింగ్, దేవాదాయ వంటి వివాదాస్పద భూములకు ఆర్డీఓలు ఎన్‌ఓసీలు, ఓఆర్‌సీలు జారీ చేస్తున్నారు. ఇందుకు పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన అధికారులపై ఎప్పటికప్పుడు ఏసీబీ దాడులు చేస్తున్నా ఏమాత్రం జంకడం లేదు. తమకేమీ పట్టనట్లుగా రాజకీయ నేతల అండదండలతో రెచ్చిపోతున్నారు.

మంఖాల్‌లో భూదాన్ భూమి మాయం

మహేశ్వరం మండలం మంఖాల్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 133లో 14 ఎకరాల భూమి ఉంది. ఇందులో మండల రెవెన్యూ రికార్డు ప్రకారం 10 ఎకరాలు భూదాన్ భూమిగా ఉంది. అదే సీసీఎల్‌ఏ రికార్డుల ప్రకారం 5 ఎకరాలు నమోదైంది. మండల రికార్డుల ప్రకారం చూస్తే.. నాలుగు ఎకరాలు మాత్రమే పట్టా భూమిగా నమోదు కావాలి. అదే సీసీఎల్‌ఏ రికార్డు ప్రకారం చూస్తే.. తొమ్మిది ఎకరాలు పట్టా భూమిగా రికార్డు కావాలి. కానీ ఈ రికార్డులకు సంబంధం లేకుండా ప్రస్తుతం 11 ఎకరాలు పట్టా భూమిగా మారడం గమనార్హం. జనార్దన్ ప్రసాద్ అనే వ్యక్తి భూదాన్ యజ్ఞబోర్డుకు ఈ భూమిని దానం చేశారు. భూదాన్ బోర్డు సమితి అప్పట్లోనే ఈ పది ఎకరాల భూమిని స్థానిక పేద రైతులకు దానం చేసింది. ఇక్కడ ఎకరం రూ.15 కోట్లకుపైనే ధర పలుకుతోంది. మండల ఆఫీసులోని ఓ సీనియర్ అసిస్టెంట్, రియల్టర్లు కలిసి ఈ భూముల స్వభావాన్నే మార్చేశారు. భూదాన్ భూమిని పట్టాగా మార్చేయడం వివాదాస్పదంగా మారింది. అధికారుల నిర్వాకంతో అసలు పట్టా భూమి భూదాన్ భూమిగా మారింది. అదే భూదాన్ భూమి పట్టా భూమిగా మారిపోయింది.

క్షేత్రస్థాయిలో ఒకలా.. ధరణిలో మరోలా

అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తొర్రూర్ రెవెన్యూ పరిధిలోని ఓ ప్రముఖ నేతకు సర్వే నంబర్ 355అలో 5.13 ఎకరాలు, 358అలో 4.20 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిని గతంలోనే ఓ రియల్టర్‌కు విక్రయించినట్లు తెలిసింది. ఆ భూముల్లో ప్లాట్లు చేసి అమ్మకాలు కూడా జరిపారు. ఇప్పటికీ...అక్కడ ప్లాట్ల క్రయ విక్రయాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ భూమి వ్యవసాయేతర భూమిగా మార్పిడి చేయకపోవడం, ధరణి పోర్టల్ వచ్చిన తర్వాత గతంలో భూమిని అమ్మిన రైతు పేరునే మొత్తం భూమి మళ్లీ రికార్డై ఉండటం ఆయనకు కలిసి వచ్చింది. క్షేత్రస్థాయిలో భూములను పరిశీలించి ధరణి పోర్టల్‌లో భూముల వివరాలను నమోదు చేయాల్సిన రెవెన్యూ అధికారులు ఇవేవీ పట్టించుకోలేదు. దీంతో సదరు ప్రజా ప్రతినిధి గుట్టు చప్పుడు కాకుండా మళ్లీ ఈ భూములకు పట్టాదారు పాసుపుస్తకాలు పొందారు. తాజాగా ఇదే భూమిని మార్కెట్లో అమ్మకానికి పెట్టి భారీగా సొమ్ము చేసుకునేందుకు యత్నిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

వాట్సాప్‌నకు పోలింగ్ స్టేషన్లు!

- బూత్, రూట్లు జియో ట్యాగింగ్
- యువ ఓటర్లను ఆకర్షించే యత్నం
- ఓటింగ్ శాతాన్ని పెంచడమే లక్ష్యం

సాక్షి, సిటీబ్యూరో: చేతిలో సెల్‌ఫోన్, ఎప్పుడు చూడు వాట్సాప్, ఫేస్‌బుక్ అంటూ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు.. యువత అంటేనే ఇదీ. నేటి జనరేషన్‌ను ఎన్నికల వైపు దృష్టి మరల్చేలా చేయాలంటే? సోషల్ మీడియాలో ఓటు హక్కు, విలువ తెలియజేస్తే సరి. ఇలాంటి ప్రయత్నాలే రాష్ట్ర ఎన్నికల సంఘం మొదలుపెట్టింది. ఇప్పటికే ఎన్నికలు, ఓటు హక్కు ప్రాధాన్యాన్ని వివరిస్తూ సామాజిక మాధ్యమాల్లో లఘు వీడియోలు, సందేశాలను ప్రచారం చేస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా పోలింగ్ స్టేషన్లు, రూట్ మ్యాప్‌లను వాట్సాప్‌నకు పంపించేలా సాంకేతిక అంశాలను పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

జియో ట్యాగింగ్..

ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ఎన్నికల సంఘం అన్ని రకాల ప్రయత్నాలు చేస్తోంది. వృద్ధులు ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకునే వీలు కల్పించిన ఈసీ. తాజాగా యువ ఓటర్లను ఆకర్షించేందుకు సిద్ధమైంది. తొలిసారి ఓటు హక్కు పొందిన యువతరం వారి నియోజకవర్గంలో పోలింగ్ స్టేషన్లు, పోలింగ్ బూత్‌లు ఎక్కడున్నాయోనని గందరగోళానికి గురి కావాల్సిన అవసరం లేకుండానే పోలింగ్ కేంద్రాలు, బూత్‌లు, ఆయా ప్రయాణ మార్గాలను జియో ట్యాగింగ్ చేయనున్నారు. దీంతో తమ పోలింగ్ బూత్ రూట్ మ్యాప్ నేరుగా వాట్సాప్‌లో చూసుకునే సౌలభ్యం ఏర్పడుతుంది.

హస్తం గూటికి 'ముద్దగోని'

- ఎల్బీనగర్ బీఆర్‌ఎస్‌లో కుదుపు!



రామ్మోహన్‌గౌడ్, ఆయన సతీమణి లక్ష్మీప్రసన్నకు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న రేవంత్‌రెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎల్బీనగర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌కు భారీ షాక్ తగిలింది. గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తరఫున బరిలోకి దిగిన నియోజకవర్గ ఇన్‌చార్జి ముద్దగోని రామ్మోహన్ గౌడ్, ఆయన సతీమణి బీఎన్‌రెడ్డి డివిజన్ మాజీ కార్పొరేటర్ లక్ష్మీ ప్రసన్న గురువారం కారు దిగి.. హస్తం గూటికి చేరారు. ఈ మేరకు గాంధీభవన్‌లో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో ఆ పార్టీ కండువా కప్పుకొన్నారు. డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, ఎల్బీనగర్ నియోజకవర్గ సమన్వయకర్త మల్‌రెడ్డి రాంరెడ్డి, మాజీ పీసీసీ కార్యదర్శి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి వారిని గాంధీభవన్‌కు వెంట తీసుకొచ్చారు. రామ్మోహన్ దారిలోనే మరికొంత మంది మాజీ కార్పొరేటర్లు కూడా ఉన్నట్లు సమాచారం.

ఆది నుంచీ వర్గపోరే..

ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందారు. ఆ తర్వాత నియోజకవర్గం అభివృద్ధి పేరుతో.. ఆ పార్టీని వీడి బీఆర్‌ఎస్‌లో చేరారు. అప్పటి నుంచి రామ్మోహన్, సుధీర్‌రెడ్డి మధ్య వర్గపోరు మొదలైంది. వీరిమధ్య అంతర్గత అభిప్రాయ భేదాలు నాలుగు నెలల క్రితం ఎల్బీనగర్ ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రి కేటీఆర్ సమక్షంలోనే బహిర్గతమయ్యాయి.ఈసారి ఎల్బీనగర్ నుంచి తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలని బీఆర్‌ఎస్ టికెట్ ఆశించారు. సిట్టింగ్‌లకే సీటు ఇవ్వనున్నట్లు పార్టీ అధినేత ప్రకటించడంతో ఆయనకు మింగుడు పడలేదు. అప్పటి నుంచి ఆయన అధికార పార్టీ కార్యక్రమాలకు కొంత దూరంగా ఉంటున్నారు.

ఒక గూటి పక్షులే కానీ..

ప్రస్తుత ఎమ్మెల్యే దేవిరెడ్డి, ముద్దగోని రామ్మోహన్‌గౌడ్‌లిద్దరూ మొదట్లో ఒకేగూటి పక్షులు. రామ్మోహన్ గౌడ్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, హైదరాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా, నియోజకవర్గ ఇన్‌చార్జిగా పని చేశారు. 2014లో దేవిరెడ్డికి, రామ్మోహన్‌కు మధ్య వివాదం తలెత్తింది. దీంతో రామ్మోహన్ 2014లో కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్‌లో చేరారు. 2014లో ఎల్బీనగర్ నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా రామ్మోహన్, కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన సుధీర్‌రెడ్డి.. టీడీపీ అభ్యర్థి ఆర్.కృష్ణయ్య చేతిలో ఓటమి పాలయ్యారు. వీరిద్దరూ 2018లో ఆయా పార్టీల నుంచి పోటీ చేశారు. సుధీర్‌రెడ్డి విజయం సాధించగా.. రామ్మోహన్ స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. ఈ క్రమంలో దేవిరెడ్డి కాంగ్రెస్‌ను వీడి అధికార బీఆర్‌ఎస్‌లో చేరారు. నాటి నుంచి మళ్లీ వీరిద్దరి మధ్య వివాదం కొనసాగుతూనే ఉంది.

ఆయిల్ పామ్ సాగుకు చేయూత

- బీసీ, ఓసీ రైతులకు 90 శాతం సబ్సిడీ
- ఎస్సీ, ఎస్టీలకు వందశాతం
- ప్రోత్సహించేందుకు ఏటా రూ. 4,200


ఆయిల్ పామ్ చెట్టు (ఫైల్)

మంచాల: ఆయిల్ పామ్ పంట సాగుకు ప్రభుత్వం చేయూతనందిస్తోందని మండల వ్యవసాయాధికారి జ్యోతి తెలిపారు. గురువారం మంచాలలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ మూస పద్ధతిలో పంటలు సాగు చేసి నష్టపోవద్దని రైతులకు సూచించారు. నూతన విధానాలతో మార్కెటింగ్‌లో మంచి లాభాలు పొందే విధంగా కృషి చేయాలన్నారు. బీసీ, ఓసీ రైతులకు ప్రభుత్వం 90 శాతం సబ్సిడీతో పాటు డ్రిప్ సౌకర్యం కల్పిస్తుందని పేర్కొన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం సబ్సిడీ ఇస్తోందని తెలిపారు. రైతులను ప్రోత్సహించేందుకు ప్రతి ఏడాది ఎకరాకు రూ.4,200 వారి అకౌంట్‌లో ప్రభుత్వం జమ చేస్తోందని చెప్పారు. ఇలా నాలుగేళ్లు ప్రోత్సాహకం అందిస్తారని వివరించారు. నాలుగేళ్ల తర్వాత పంట దిగుబడి మొదలై.. 30 సంవత్సరాల వరకు వస్తుందన్నారు. పంటను ఆయిల్ అండ్ వాల్యూ కంపెనీ పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఆయిల్ పామ్ సాగుపై ఆసక్తి ఉన్న రైతులు ఫోన్ నంబర్ 6305920178ను సంప్రదించాలని కోరారు.

కారు గుర్తుకు ఓటేస్తే భవిష్యత్తు


మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని కలిసిన రమేశ్‌గౌడ్ తదితరులు

- అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించండి
- కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి
- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

యాచారం: ఎన్నికలు సమీపిస్తుండడంతో మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. తొమ్మిదేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలే విజయతీరాలకు చేర్చుతాయని గులాబీ నేతలు గంపెడాశతో ఉన్నారు. కారు గుర్తుకు ఓటేస్తే భవిష్యత్తులో మంచి జరుగుతుందని ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలని కార్యకర్తలకు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. గురువారం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కర్నాటి రమేశ్‌గౌడ్ పుట్టినరోజు సందర్భంగా పార్టీ శ్రేణులు ఏర్పాటు చేసిన వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని.. రమేశ్‌గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. దళితబంధు, బీసీబంధు, రైతుబంధు, రైతుబీమా, గృహలక్ష్మి పథకం, సీఎం రిలీఫ్ ఫండ్, పింఛన్లు తదితర పథకాల వలన లబ్ధిపొందిన వారి వద్దకు వెళ్లి గులాబీ పార్టీకి ఓటు వేయాలని అభ్యర్థించాలని కార్యకర్తలకు సూచించారు. ఎన్నికలు జరిగే వరకు పార్టీ శ్రేణులు విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకర్‌నాయక్, యాదయ్యగౌడ్, గోపాల్, సత్యపాల్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

ఆల్ నైన్స్‌కు రూ.15.53 లక్షలు

సాక్షి, సిటీబ్యూరో: ఆర్టీఏ ప్రత్యేక నంబర్‌లపై వాహనదారులు మరోసారి క్రేజీను చాటుకున్నారు. గురువారం ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో నిర్వహించిన ఆన్‌లైన్ బిడ్డింగ్‌కు అనూహ్యమైన స్పందన వచ్చింది. ప్రత్యేక నంబర్‌లపై రూ.41,86,370 ఆదాయం వచ్చినట్లు జేటీసీ పాండురంగ్ నాయక్ తెలిపారు. 'టీఎస్ 09 జీడీ 9999' నంబర్‌ను ముప్పా హోమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.15,53,000 చెల్లించి సొంతం చేసుకుంది. 'టీఎస్ 09 జీఈ 0009' నంబర్ కోసం గీతా ఆటోమోటివ్ ఎల్‌ఎల్‌పీ అనే సంస్థ రూ.3,29,999 చెల్లించింది. 'టీఎస్ 09 జీఈ 0001' నంబర్‌కు శ్రీనివాస్‌బాబు అనే వాహన యజమాని రూ.3,06,000 చెల్లించారు. 'టీఎస్ 09 జీఈ 0005' నంబర్ కోసం శ్రీలక్ష్మీ గణపతి ఇండస్ట్రీస్ సంస్థ రూ.2,10,000 చెల్లించింది. 'టీఎస్ 09 జీఈ 0019' నంబర్‌కు నాగవంశీ సూర్యదేవర అనే యజమాని రూ.2,03,000 చెల్లించారు. టీఎస్ 09 జీఈ 0006 నంబర్‌కు కల్పన అనే యజమాని రూ.1,90,000కు దక్కించుకున్నారు. టీఎస్ 09 జీఈ 0023 నంబర్ కోసం స్టోన్ క్రాఫ్ట్ ప్రాపర్టీస్ అనే సంస్థ రూ.1,56,116 చెల్లించి సొంతం చేసుకుంది. 'టీఎస్ 09 జీఈ 0027' నంబర్ కోసం న్యూ లాండ్ లేబోరేటరీస్ రూ.1,27000 చెల్లించింది.

శరన్నవరాత్రులకు ముస్తాబు


వాసవీ కన్యకాపరమేశ్వరి


ఆమనగల్లులోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం

- ఆదివారం నుంచి వేడుకలు ప్రారంభం
- దశావతారాల్లో భక్తులకు దర్శనం
- 11 రోజుల పాటు ఉత్సవాలు

ఆమనగల్లు: శరన్నవరాత్రి మహోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి గడియలు ప్రవేశించగానే శరన్నవరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ చేస్తారు. ఆదివారం నుంచి పది రోజుల పాటు అమ్మవారు రోజుకో అలంకారంలో దర్శనమిస్తారు. దేవీ నవరాత్రులు, బతుకమ్మ పండుగ రెండూ అమ్మవారికి ఆరాధనలే. ఆశ్వయుజ మాసంలో సాగే ఈ రెండు వేడుకల్లో అమ్మవారిని రోజుకొక పేరుతో కొలుస్తారు. ఆమనగల్లు పట్టణంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఈనెల 15 నుంచి 25వ తేదీ వరకు దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ప్రతి ఏటా ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతిరోజు యజ్ఞం, అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు రామ్మోహన్, ప్రధాన కార్యదర్శి నర్సింహ, కోశాధికారి శ్రీనివాస్ తెలిపారు.

అలంకారాలివే

15న అమ్మవారికి బాలాత్రిపురసుందరీదేవి అలంకారంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలు ప్రారంభించనున్నారు. 16న శాకంబరీ దేవి అలంకారం, 17న గాయత్రిదేవి, 18న ధనలక్ష్మిదేవి, 19న అన్నపూర్ణాదేవి, 20న సరస్వతిదేవి, 21న లలితాదేవి, 22న దుర్గాదేవి, 23న మహిషాసుర మర్ధని, 24న రాజరాజేశ్వరీదేవి, 25న దుర్గాదేవి అలంకారంతో భక్తులకు దర్శనమిస్తారు. అనంతరం పూర్ణాహుతి, అమ్మవారి ఊరేగింపు నిర్వహించనున్నారు.

ప్రత్యేక పూజలు



శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నాం. ఉత్సవాల కోసం ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశాం. ప్రతిరోజు అన్నదానం నిర్వహిస్తాం. ఉత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలి.

– రామ్మోహన్, ఆలయ కమిటీ అధ్యక్షుడు

నీటమునిగి ఇద్దరి మృతి

జవహర్‌నగర్: చెరువులో స్నానానికి వెళ్లి ఇద్దరు మృతి చెందారు. కౌకూర్ దర్గా ఉర్సు ఉత్సవాలకు వచ్చిన ఇద్దరు వ్యక్తులు చెరువులో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతిచెందిన సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సీతారాం కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. లంగర్‌హౌస్‌కు చెందిన సలీం (30), ఫర్వీజ్ పెయింటర్లుగా పని చేస్తున్నారు. వీరు కుటుంబ సభ్యులతో కలిసి కౌకూర్ దర్గాలో ఉర్సు ఉత్సవాలకు వచ్చారు. గురువారం ఉదయం సలీం, ఫర్వీజ్ స్థానిక బార్లపేట్ చెరువులో స్నానం చేసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు మునిగి మృతిచెందారు. సలీం భార్య సుల్తానా క్లళ్లెదుటే అతను నీటిలో చెరువులో మునిగి మృతి చెందడంతో ఆమె బోరున విలపించింది. రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను బయటికి తీసి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సంప్రదాయానికి ప్రతీక బతుకమ్మ


వర చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న లక్ష్మీనర్సింహారెడ్డి

సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్: బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని దేవర చెరువు బతుకమ్మ ఘాట్ వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తొమ్మిది రోజుల పాటు జరిగే ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలని ప్రజలకు సూచించారు.

బతుకమ్మ సంబురాలు

మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులు గురువారం ముందస్తుగా బతుకమ్మ సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు బతుకమ్మ ఆట పాటలతో హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్‌ఓ అనిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు

బీజేవైఎం జాతీయాధ్యక్షుడు తేజస్వీ సూర్య


శ్రీశైలాన్ని ఘనంగా సత్కరిస్తున్న తేజస్వీ సూర్య, లక్ష్మణ్

యాచారం: దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, నిరుద్యోగ సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం చేయాలని బీజేవైఎం జాతీయాధ్యక్షుడు తేజస్వీ సూర్య పిలుపునిచ్చారు. బీజేవైఎం ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేస్తున్న సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీశైలంను రాష్ట్ర పార్టీ కార్యాలయంలో గురువారం ఘనంగా సన్మానించారు. శ్రీశైలం చేసిన ఉద్యమాలు, పోరాటాలను గుర్తించి తేజస్వీ సూర్య, ఓబీసీ మోర్చా జాతీయాధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ శ్రీశైలాన్ని సత్కరించారు. భవిష్యత్తులో మరిన్ని పోరాటాలు నిర్వహించి నిరుద్యోగ సమస్య లేకుండా చూడాలని వారు సూచించారు.

'అవినీతి లేకుండా పని చేస్తాం'

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)లో ఎన్నికల సందడి మొదలైంది. ఈ నెల 20న జరగాల్సిన ఎన్నికలకు సంబంధించి వేర్వేరు ప్యానెళ్లు తమ గెలుపు ప్రయత్నాలు ప్రారంభించాయి. ఈ నేపథ్యంలో ఒక వర్గం ఆనెస్ట్, హార్డ్‌వర్కింగ్ హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌హెచ్‌హెచ్‌సీఏ) పేరుతో తమ అభ్యర్థులను బరిలోకి దింపుతోంది. హెచ్‌సీఏలో అవినీతిని నిర్మూలించేందుకు తాము చేసిన ప్రయత్నం వల్లే 57 క్లబ్‌లపై వేటు పడిందని, ముమ్ముందూ నిజాయితీగా పనిచేస్తామని ఈ గ్రూప్ ప్రకటించింది. క్రికెట్‌తో సంబంధం లేని కొందరు బయటి వ్యక్తులు ఎన్నికల్లో భాగమయ్యేందుకు ప్రయత్నిస్తున్నారని, వారితో ఆటకు ఎలాంటి మేలు జరగదని హెచ్‌హెచ్‌హెచ్‌సీఏ వర్గం సభ్యులు వ్యాఖ్యానించారు. అన్ని క్లబ్‌లు తమతోనే ఉన్నాయని, ఎలక్షన్స్‌లో విజయం సాధిస్తామని ఈ ప్యానెల్ విశ్వాసం వ్యక్తం చేసింది. అందుబాటులో ఉన్న ఆరు పదవుల కోసం తమ అభ్యర్థులను ప్రకటించింది. అధ్యక్ష, కార్యదర్శి పదవుల కోసం పీఎల్ శ్రీనివాస్, ఆర్‌ఎం భాస్కర్, ఉపాధ్యక్షుడిగా బాబూరావు, సంయుక్త కార్యదర్శిగా రోహిత్ అగర్వాల్, కోశాధికారి పదవి కోసం జెరార్డ్ కార్, కౌన్సిలర్‌గా డీఏజీ వాల్టర్ బరిలో నిలిచారు.

పట్టపగలే దొంగల హల్‌చల్

- రెండు ఇళ్లల్లో చోరీ
- నగదు, బంగారం అపహరణ

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి పట్టణ కేంద్రంలో పట్టపగలే దొంగలు స్వైర విహారం చేశారు. వేర్వేరు కాలనీల్లో రెండు ఇళ్లల్లో చోరీకి పాల్పడ్డారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని 7వ వార్డులో పిల్లగుండ్ల రాజు ఇంట్లో వెంకటయ్య అనే ఉపాధ్యాయుడు కిరాయికి ఉంటున్నారు. వెంకటయ్య భార్య కూడా ఉపాధ్యాయురాలే. వీరిద్దరూ రోజు మాదిరిగా విధులకు వెళ్లారు. అయితే గురువారం మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో దొంగలు తాళం పగులగొట్టి.. ఇంట్లో ఉన్న 2 తులాల బంగారం, 15తులాల వెండి, రూ.10వేలు నగదు, రెండు సెల్ ఫోన్‌లు, రెండు స్మార్ట్ వాచ్‌లను ఎత్తుకుపోయారని బాధితులు తెలిపారు. అదేవిధంగా 14వ వార్డులోని శ్రీరాం నగర్ కాలనీలో బద్దం రాఘవేందర్ ఇంట్లో అద్దెకు ఉంటున్న వంశీ, అతని భార్య ప్రైవేట్ ఉపాయులు. భార్యాభర్తలిద్దరూ పని నిమిత్తం బయటకు వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చే చూడగా.. 15తులాల బంగారు నగలు, రూ.లక్ష, 40వేల నగదును అపహరించుకొని పోయారని బాధితులు పేర్కొన్నారు. చోరీ జరిగిన విషయం పోలీసులకు తెలియడంతో శంకర్‌పల్లి డిటెక్టివ్ సీఐ నాగరాజు, డిటెక్టివ్ ఎస్ఐ సత్యనారాయణ ఘటన స్థలానికి చేరుకొని, క్లూస్ టీంను రప్పించి ఆనవాళ్లను, వేలి ముద్రలను సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సెంచరీ దాటిన పోకిరీలు

15 రోజుల్లో 105 మంది అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ఎక్కడా మహిళలకు రక్షణ, భద్రత లేకుండా పోతుంది. బస్టాండ్‌లు, మెట్రో, రైల్వే స్టేషన్లు, విద్యా సంస్థలు, బహిరంగ ప్రదేశాల్లో మహిళలను వెంబడిస్తూ వేధింపులకు గురి చేస్తున్నారు. గత 15 రోజుల వ్యవధిలో రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలో 105 మంది ఆకతాయిలను షీ టీమ్స్ పోలీసులు పట్టుకున్నారు. ఇందులో 58 మంది మేజర్లు, 47 మంది మైనర్లు ఉన్నారు. వీరికి వారి తల్లిదండ్రుల సమక్షంలో ఎల్బీనగర్‌లోని సీపీ క్యాంప్ కార్యాలయంలో రాచకొండ ఉమెన్ సేఫ్టీ డీసీపీ ఉషా విశ్వనాథ్ గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం 81 ఫిర్యాదులు అందాయని, ఇందులో ఫోన్ ద్వారా వేధించిన కేసులు 21 కాగా.. వాట్సాప్, మెసేజీల ద్వారా 24, సోషల్ మీడియా 19, నేరుగా వేధించిన కేసులు 17 ఉన్నట్లు తెలిపారు. వీటిల్లో 11 క్రిమినల్, 38 పెట్టీ, 32 కౌన్సెలింగ్ కేసులు నమోదు చేశామన్నారు.

మద్యం కోసం సోదరుడి హత్య

- అన్నను హతమార్చిన తమ్ముడు
- కొందుర్గు మండల కేంద్రంలో ఘటన
- నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

కొందుర్గు: మానవత్వాన్ని మంటగలుపుతున్నారు. అన్నదమ్ములు, తండ్రీకొడుకుల అనుబంధం, ఆప్యాయతలు రోజురోజుకు దిగజారి పోతున్నాయి. చిన్నచిన్న కారణాలతో తోడబుట్టిన వారిని, కన్నవారిని కూడా హత్య చేసేందుకు వెనకాడని కాలంలో మనం ఉన్నాం. మద్యానికి బానిసైన ఓ తమ్ముడు సొంత అన్ననే హత్య చేశాడు. ఈ ఘటన గురువారం కొందుర్గులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. కొందుర్గుకు చెందిన బోయ మల్లమ్మ, కృష్ణయ్య దంపతులకు నవీన్(25), నరేశ్ (23) కుమారులు. నవీన్ సెంట్రింగ్ పని చేస్తుండగా.. నరేశ్ ట్రాక్టర్ డ్రైవర్. అయితే కుటుంబ అవసరాలు కోసం పది గుంటల భూమిని అమ్మారు. అప్పటి నుంచి నరేశ్ తరుచుగా మద్యం తాగుతూ, జులాయిగా తిరుగుతున్నాడు. ఈ క్రమంలో మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వాలని నరేశ్ తన సోదరుడితో తరచూ గొడవకు దిగేవాడు. అన్న డబ్బులు ఇవ్వకపోవడంతో కక్ష పెంచుకున్న తమ్ముడు.. బుధవారం రాత్రి నవీన్ నిద్రిస్తున్న సమయంలో ఇనుప వైర్‌ను మెడకు బిగించి హత్య చేశాడు. గురువారం నవీన్ మృతి చెందిన విషయాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. షాద్‌నగర్ రూరల్ సీఐ లక్ష్మీరెడ్డి, ఎస్ఐ కృష్ణయ్య ఘటన స్థలాన్ని పరిశీలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. తల్లి మల్లమ్మ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుతున్నామని సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

టిప్పర్ సీజ్

తలకొండపల్లి: అనుమతి లేకుండా ఇసుకను రవాణా చేస్తున్న టిప్పర్‌ను పోలీసులు సీజ్ చేశారు. ఎస్ఐ శ్రీను చెప్పిన వివరాల ప్రకారం.. గురువారం మండల పరిధిలోని వెంకటాపూర్ గేట వద్ద ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసులు పట్టుకున్నారు. డ్రైవర్ మల్లేశ్, యజమాని శంకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు. టిప్పర్‌ను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

చెరువులో పడి వృద్ధుడి మృతి

షాబాద్: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన షాబాద్ మండలంలోని నాగర్‌కుంట గ్రామ శివారులోని చెరువులో గురువారం చోటుచేసుకుంది. షాబాద్ ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... నాగర్‌కుంట గ్రామానికి చెందిన వడ్డే అంజప్ప (70) చెరువులో పడి మృతి చెందాడు. గురువారం ఉదయం చెరువులో మృతదేహం ఉన్నట్లు గ్రామస్తులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనాస్థలికి వెళ్లి పోలీసులు పరిశీలించగా.. అదే గ్రామానికి చెందిన అంజప్పగా గుర్తించారు. ఈనెల 9న ఉదయం ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోవడంతో స్థానికంగా, బంధువుల వద్ద ఎంత వెతికినా అతడి ఆచూకీ దొరకలేదని కుటుంబసభ్యులు చెబుతున్నారు. తన తండ్రికి కళ్లు సరిగ్గా కనిపించపోవడంతో ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెంది ఉండవచ్చని కొడుకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బెల్టు షాపులపై దాడి.. మద్యం స్వాధీనం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం పోలీసులు గురువారం వేర్వేరుగా బెల్ట్ షాపుపై దాడులు నిర్వహించి 41 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నలుగురిపై కేసు నమోదు చేశారు. స్థానిక ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. నాగన్‌పల్లి గ్రామంలో సత్యనారాయణ, సురేశ్, లింగమయ్యగౌడ్, పోల్కంపల్లి గ్రామంలో శివ అనే వ్యక్తులు నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై దాడులు జరిపినట్లు తెలిపారు. సుమారు 41 లీటర్ల లిక్కర్‌ను స్వాధీనం చేసుకొని.. నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

భగ్గుమంటున్న ఎండలు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ఎండలు వేసవిని తలపిస్తున్నాయి. ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిని దాటుతున్నాయి. బయటకు వెళ్లేందుకు జంకే పరిస్థితి నెలకొంది. గత వారం రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. వివిధ పనుల మీద బయటికి వెళ్లిన వారు ఎండ తాపాన్ని తట్టుకోలేక పోతున్నారు. గురువారం సాధారణ ఉష్ణోగ్రత 1.5 డిగ్రీలు ఉండాల్సి ఉండగా, గరిష్ఠ స్థాయి ఉష్ణోగ్రత 33.2 డిగ్రీల సెల్సియస్‌గా, కనిష్ఠ ఉష్ణోగ్రత 21.2 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. గాలిలో తేమ 69 శాతం నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

143 సైబర్ నేరాల్లో 19 మంది అరెస్టు



సాక్షి, సిటీబ్యూరో: సైబర్ నేరాలపై మరింత సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ఏర్పాటైన తెలంగాణ రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీఎస్‌సీఎస్‌బీ) కార్యాచరణను వేగవంతం చేసింది. ఇటీవలి కాలంలో రాష్ట్రంలో పెట్టుబడి, వ్యాపార మోసాలకు సంబంధించిన సైబర్ నేరాలు పెరిగిపోతున్న నేపథ్యంలో వీటిపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ మేరకు టీఎస్‌సీఎస్‌బీ డైరెక్టర్, సైబరాబాద్ పోలీసు కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర టీఎస్‌సీఎస్‌బీ సైబరాబాద్, హైదరాబాద్, రాచకొండ, కరీంనగర్, వరంగల్, సిద్దిపేట, జగిత్యాల జిల్లాలకు చెందిన 6 కమిషనరేట్‌ల నుంచి విచారణాధికారులతో కూడిన 14 బృందాలతో మెగా డ్రైవ్ నిర్వహించారు. రాష్ట్రంలో నమోదైన 143 సైబర్ క్రైమ్ కేసుల్లో డేటాను సాంకేతిక విశ్లేషించిన అధికారులు నేరస్తులకు సంబంధించిన సమాచారాన్ని సేకరించారు. వెంటనే ఆయా ప్రత్యేక బృందాలు నేరస్తుల కోసం తెలంగాణతో పాటు గుజరాత్, రాజస్థాన్, జార్ఖండ్, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, కేరళ, ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రాల్లో గాలించి, 19 మంది నేరస్తులను పట్టుకున్నారు. వీరిపై పలు రాష్ట్రాల్లో 726 కేసులు ఉన్నట్లు తెలిపారు. వీరి నుంచి 26 సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్, 45 డెబిట్ కార్డులు, 9 బ్యాంకు పాస్‌బుక్‌లు, పీఓఎస్ మిషన్, 11 చెక్ బుక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

ఇన్‌చార్జ్ సీపీ వీడియో కాన్ఫరెన్స్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ ఇన్‌చార్జ్ పోలీసు కమిషనర్ విక్రమ్ సింగ్ మాన్ గురువారం నగర పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ (వీసీ) నిర్వహించారు. ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా వివిధ రకాలైన ఎలక్షన్ నేరాలను నిరోధించే చర్యలపై ఆయన దిశానిర్దేశం చేశారు. ఎలక్షన్ సెల్ ఇన్‌చార్జ్ రాధేష్ మురళీ, నగర పోలీసు న్యాయ సలహాదారు రాములు కార్యక్రమంలో పాల్గొన్నారు.